ఆదివారం 17, నవంబర్ 2024

https://www.telugudesam.org



చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





రామోజీ జీవితం మనందరికీ మార్గదర్శకం

జయంతి నివాళులర్పించిన చంద్రబాబు

4



# రామ్మూర్తి నాయుడు కన్నుమూత



- తమ్ముడి ఆత్మకు శాంతికలగాలంటూ నివాళి
- రోహిత్, గిరీశ్‌లను అక్కున చేరుకున్న బాబు
- నిన్నటి వరకూ ధైర్యం.. నేటినుంచి జ్ఞాపకం
- చిన్నాన్నను గద్గద స్వరంతో గుర్తు చేసుకున్న లోకేష్
- ఏఐజీలో పార్థివ దేహం వద్ద పలువురి నివాళి
- నేడు నారావారిపల్లెకు పార్థివ దేహం
- పోలీసు లాంఛనాలతో అక్కడే అంత్యక్రియలు
- రామ్మూర్తి కుటుంబానికి పలువురి సంతాపం




- దిగ్భ్రాంతికి గురైన తెలుగు రాష్ట్రాలు
- తమ్ముడు మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు
- బాధాతప్త హృదయంతో ప్రకటించిన చంద్రబాబు

2



"నా తమ్ముడు, చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయాడని బాధాతప్త హృదయంతో తెలియజేస్తున్నాను. రామ్మూర్తినాయుడు ప్రజా జీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు అందించిన నాయకుడు. మానుంచి దూరమై మా కుటుంబంలో ఎంతో విషాదాన్ని నింపాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను"

*- నారా చంద్రబాబు నాయుడు*

## 'సోషల్' సైకోలకు చెక్

- ❑ విపరీత ధోరణులను నియంత్రించాలి
- ❑ దేశంలో తొలిసారి వాట్సాప్ గవర్నెన్స్
- ❑ జనాభా నిర్వహణపై దృష్టిపెట్టాలి
- ❑ ఇద్దరు పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హత
- ❑ కొత్త నిబంధనలు అమల్లోకి తేవాలి
- ❑ మోదీ నేతృత్వం.. దేశానికి ఆర్థిక బలం
- ❑ 2029 ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం
- ❑ కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది..
- ❑ ఢిల్లీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు

4





## విచ్ఛిన్నకర శక్తులను తరిమికొట్టండి

- మహారాష్ట్రలో ఛత్రపతి స్ఫూర్తిని గెలిపించాలి
- అభివృద్ధి కోసం మహాయుతి విజయం అవసరం
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

7

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

- మంత్రి సవిత ఉద్ఘాటన
- గుంటూరులో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం
- బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు
- త్వరలో ఆన్ లైన్లోనూ అందుబాటులోకి
- డిసెంబర్ నుంచి సివిల్స్ కోచింగ్

8

## చిన్నాన్న ఇక జీవితకాల జ్ఞాపకం

- ◆ చిన్ననాటి అనుబంధం కళ్లల్లో కదులుతోంది
- ◆ రామ్మూర్తి నాయుడికి మంత్రి లోకేష్ నివాళి

- వివరాలు 2లో..



## రామ్మూర్తి నాయుడి సేవలు మరువలేనివి

- స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రుల సంతాపం

5

గొప్ప మానవతావాది రామ్మూర్తి నాయుడు

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతల నివాళులు

6

## వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్లలో అక్రమాలపై దర్యాప్తు

- మంత్రి నారాయణ వెల్లడి
- జగన్ పిచ్చి పనులతో లబ్ధిదారులకు ఇక్కట్లు
- లబ్ధిదారులు తొలగింపు, డీడీల చెల్లింపుల్లో అవకతవకలు
- అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చకు మంత్రి సమాధానం

7

### ఉపాధి హామీ కాంట్రాక్టర్లకు కూటమి ప్రభుత్వం అండ

- గత ప్రభుత్వం ఆపిన బిల్లుల మంజూరు
- జగన్‌రెడ్డి కాంట్రాక్టర్ల నోట్లో మట్టికొట్టారు
- కేంద్రం నిధులు ఇచ్చినా దారిమళ్లించారు
- గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి

5

## పొలాన్ని ఆక్రమించేందుకు వైసీపీ నేత యత్నం

- వరి కోత మిషన్ తగలబెట్టేస్తానని బెదిరింపులు
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుడి గోడు
- అర్జీలు స్వీకరించిన గండి బాబ్జి, బుచ్చి రాంప్రసాద్



- వివరాలు 5లో..

చైతన్యరథం

# రామ్మూర్తినాయుడు కన్నుమూత

- దిగ్భ్రాంతికి గురైన తెలుగు రాష్ట్రాలు
- తమ్ముడు మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు
- బాధాతప్త హృదయంతో ప్రకటించిన చంద్రబాబు
- తమ్ముడి ఆత్మకు శాంతికలగాలంటూ నివాళి
- రోహిత్, గిరీశ్‌లను అక్కున చేరుకున్న బాబు
- నిన్నటి వరకూ ధైర్యం.. నేటి నుంచి జ్ఞాపకం
- చిన్నాన్నను గద్గద స్వరంతో గుర్తు చేసుకున్న లోకేష్
- ఏఐజీలో పార్థివ దేహం వద్ద పలువురి నివాళి
- నేడు నారావారిపల్లెకు పార్థివ దేహం
- మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు
- రామ్మూర్తి కుటుంబానికి పలువురి సంతాపం



హైదరాబాద్ (చైతన్య రథం): ఏపీ సీఎం చంద్రబాబునాయుడి సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి.. రామ్మూర్తి నాయుడు (72) మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మధ్యాహ్నం 12:45 గంటలకు మరణించినట్లు ఏఐజీ వైద్యులు వెల్లడించారు. 1994లో తెదేపానుంచి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. రామ్మూర్తి నాయుడు ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించిందన్న సమాచారం అందుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగమేఘాల మీద ఢిల్లీనుంచి రాష్ట్రానికి వెనుతిరిగారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్ పూర్తి చేసుకుని.. అక్కడి నుంచి మహారాష్ట్రలోని ఎన్నికల ప్రచారానికి వెళ్లాల్సిన సీఎం చంద్రబాబు తన పర్యటనల రద్దు చేసుకుని ఏపీకి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు.. ఏఐజీ ఆసుపత్రిలో తమ్ముడు రామ్మూర్తినాయుడు పార్థివ దేహం వద్ద నివాళి అర్పించారు. సోదరుడి కుమారులు రోహిత్, గిరీష్‌ను చంద్రబాబు ఓదార్చి ధైర్యం చెప్పారు. ఏపీలోని అసెంబ్లీ, మండలి సమావేశాలతో బిజీగావున్న మంత్రి లోకేష్ సైతం - చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని తన కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. సమాచారం అందిన మరుక్షణమే శనివారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. లోకేష్ సోదరులు రోహిత్, గిరీశ్‌లకు ధైర్యం చెప్పి.. వారి వెంటే ఉన్నారు. రామ్మూర్తినాయుడు మరణించారన్న సమాచారం తెలియడంతో రాష్ట్రం దిగ్భ్రాంతికి గురైంది. అక్కడ నారావారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నారా రామ్మూర్తినాయుడు మృతితో కుటుంబ సభ్యులు, బంధువర్గాలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రామ్మూర్తినాయుడు కడపటి చూపుకోసం బంధువర్గం, స్నేహితులు నారావారి పల్లెకు చేరుకుంటున్నారు. ఇదిలావుంటే, ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలు నారావారిపల్లెలో నిర్వహించనున్నారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఏర్పాట్లు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. తల్లిదండ్రులు అమ్మణమ్మ, ఖర్జూర నాయుడు సమాధుల దగ్గరే అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు రామ్మూర్తినాయుడు పార్థివదేహాన్ని తీసుకెళ్తారు. రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా నారావారిపల్లెకు తీసుకెళ్లి.. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల సందర్శనార్థం నారావారిపల్లెలో పార్థివదేహాన్ని ఉంచుతారు. అనంతరం అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### తమ్ముడి ఆత్మకు శాంతి కలగాలి: చంద్రబాబు

"నా తమ్ముడు, చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయాడని బాధాతప్త హృదయంతో



తెలియ జేస్తున్నాను. రామ్మూర్తినాయుడు ప్రజా జీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు అందించిన నాయకుడు. మానుంచి దూరమై మా కుటుంబంలో ఎంతో విషాదాన్ని నింపాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

### సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం



మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.



"ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణించారని తెలిసి చింతిస్తున్నా. రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలి. సోదర వియోగంతో బాధపడుతున్న సీఎం చంద్రబాబుకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఉండటంతో రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు హాజరు కాలేకపోతున్నా. రామ్మూర్తి నాయుడు కుమారుడు రోహిత్, కుటుంబసభ్యులకు నా సంతాపం తెలుపుతున్నా"

**- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



"నారా రామ్మూర్తి నాయుడు మృతి ఎంతో బాధించింది. ఆయన కుటుంబం, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు, తెదేపా కార్యకర్తలకు ఆయన మరణం తీరనిలోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నా"

**- మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**



"నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరం. ఆయన మృతి నారా కుటుంబానికి తీరని లోటు. ఆయన చంద్రగిరి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. ఆయన పార్టీకి చేసిన సేవలు వెలకట్టలేనివి. రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి కలగాలి"

**- కనకమేడల రవీంద్రకుమార్**

ఇదిలావుంటే, రామ్మూర్తినాయుడు మృతి చెందారన్న సమాచారం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేసి పరామర్శించారు. నారా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లిన బాలకృష్ణ,తీగల కృష్ణారెడ్డి,మోత్కుపలి నర్సింహు లు రామ్మూర్తి నాయుడి భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. రామ్మూర్తినాయుడి మృతిపట్ల మంత్రులు గొట్టిపాటి రవి,అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు, నారాయణ, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, పార్థసారథి, డోలా బాలవీరాంజనేయస్వామి, దుర్గేష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సవిత,వాసంశెట్టి శుభాష్, కొండపల్లి శ్రీనివాస్, చీఫ్ విప్ జీవీ ఆంజ నేయులు, ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, ఎమ్మెల్యేలు వెని గండ్ల రాము, ఎమ్మెల్యేలు యరపతినేని, కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నక్కా ఆనందబాబు, ధూళిపాళ నరేంద్ర, ఎం.ఎస్.రాజు, భాష్యం ప్రవీణ్, టీడీపీ నేత బీదా రవిచంద్ర, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్‌వి రమణ, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

### చిన్నాన్న ఇక చిరస్మరణీయ జ్ఞాపకం



చిన్నాన్న నారా రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర విషాదం నింపిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. చిన్నాన్నతో చిన్ననాటి నా అనుబంధం కళ్ల ముందు కదులుతూ వచ్చిన కన్నీటితో నివాళు లు అర్పిస్తున్నానన్నారు. మౌనమునిలా మారిన చిన్నాన్న ఇన్నాళ్లూ మాకు కంటికి కనిపించే ధైర్యం.. నేటి నుంచి చిరస్మరణీయ జ్ఞాపకం. చిన్నాన్న ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నాను. అంతులేని దుఃఖంలో ఉన్న తమ్ముళ్లు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నానన్నారు.

**- మంత్రి లోకేష్**

## రామ్మూర్తిని గుర్తు చేసుకుంటున్న నారావారిపల్లె

నారావారిపల్లెకు తలలో నాల్కలా ఉండే రామ్మూర్తినాయుడిని గుర్తు చేసుకుని.. ఆ ప్రాంత ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రామ్మూర్తిని భోళాశంకరుడి మనస్తత్వమని, ఏ విషయాన్నైనా మొహం మీద అడిగేస్తాడంటూ స్నేహితులు, బంధువులు గుర్తు చేసుకున్నారు. అన్న చంద్రబాబు ప్రజల కోసం తీరికలేకుండా వున్నసమయంలో.. తమ్ముడిగా రామ్మూర్తి నాయుడే ఎక్కువగా కుటుంబ బాధ్యతలు మోశాడని కొందరు, నమ్మిన చంద్రగిరి నాయకులు కడవరకూ రామ్మూర్తినాయుడు వెంటే ఉన్నారని, నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత రామ్మూర్తినాయుడుకి చిరస్థాయిగా ఉంటుందంటూ పలువురు గుర్తు చేసుకుంటున్నారు.

### ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




## సామాజిక న్యాయం

# క్రీడాంధ్రప్రదేశ్

1. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడంలో చంద్రబాబు నాయుడు గారు ముందుంటారు.
2. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రన్న నిర్మించిన స్టేడియాల్లో శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు.
3. 2003లో ఆఫ్రో ఆసియా క్రీడలకు ఆతిథ్యమిచ్చి, దాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.
4. ఉప్పల్, గచ్చిబౌలి, సరూర్ నగర్ క్రికెట్ స్టేడియంల నిర్మాణానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శ్రీకారం.
5. పుల్లెల గోపిచంద్ అకాడమికీ హైదారాబాద్ (2003)లో 5 ఎకరాలు, అమరావతి 2017 లో 12 ఎకరాలు కేటాయింపు.
6. పి.వి.సింధు, కరణం మల్లీశ్వరిలకు గ్రూప్-1 ఉద్యోగాలిచ్చాం.
6. జగన్ పాలనలో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో అవినీతే తప్ప క్రీడలను పట్టించుకోలేదు.
7. నవ్యాంధ్రప్రదేశ్‌లో మంగళగిరిలో 24 ఎకరాల్లో 34,000 సీటింగ్ సామర్థ్యంతో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం.



చైతన్యరథం

# 'సోషల్' సైకోలకు చెక్

- విపరీత ధోరణులను నియంత్రించాలి
- దేశంలో తొలిసారి వాట్సాప్ గవర్నెన్స్
- జనాభా నిర్వహణపై దృష్టిపెట్టాలి
- ఇద్దరు పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హత
- కొత్త నిబంధనలు అమల్లోకి తేవాలి
- మోదీ నేతృత్వం.. దేశానికి ఆర్థిక బలం
- 2029 ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం
- కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది..
- ఢిల్లీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు




ఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడి తల్లి, చెల్లిపైన వారి పార్టీ నాయకులే అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్నారు. ఢిల్లీలో పర్యటించిన చంద్రబాబు.. హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్లో పాల్గొన్నారు. ప్రజల కోసం పనిచేసి అక్రమ కేసులకు గురికావడం తనను బాధించిందన్నారు. అక్రమ కేసులు పెట్టి 53 రోజులు వేధించారు. చేయని తప్పునకు శిక్ష అనుభవించానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎక్కడా నిరాశకు గురికాలేదు. ధైర్యం కోల్పోలేదన్నారు. 53 రోజుల జైలు జీవితం.. మరింత పట్టుదల పెరిగేలా చేసిందని, ఆ పట్టుదలను ప్రజలకు సేవ చేయటానికి ఉపయోగిస్తున్నానని చంద్రబాబు చెప్పారు.

### సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయాలి

"సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయి. వ్యక్తిత్వ హననం జరుగుతోంది. మహిళలను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారు. మమ్మల్ని మాత్రమే కాదు.. సొంత తల్లి, చెల్లిని కూడా బూతులు తిట్టిస్తున్న వాళ్లని ఏం చేయాలి? ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకూడదు అంటే ఎలా? సోషల్ మీడియాలో మహిళల్ని వేధించే వారిని ఎలా నియంత్రించాలనే అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరగాలి. సామాజిక మాధ్యమాల్లో వేధించే సైకోలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రభాగాన నంబర్ వన్‌గా ఉండాలనేది లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. టెలికాం రంగంలో డీరెగ్యులేషన్ వల్ల పురోగతి ఉంటుందని రిపోర్టు ఇచ్చాను. దాన్ని అమలు చేయడం వల్ల టెలికాం రంగం వృద్ధి చెందింది. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని తీసుకొస్తున్నాం. దీని ద్వారా ప్రజలకు చేరువగా, సులువుగా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. తద్వారా ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది మా లక్ష్యం. ఈ యుగంలో సమాచారమే ఓ పెద్ద నిధి. ఏఐ, డీప్ టెక్నాలజీలను ఉపయోగించి అన్ని రంగాల్లో పరిష్కారాలు సాధించవచ్చు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచంలో ఏ మూలనున్నా మన పనులు చేసుకుంటూ పోవచ్చు.

### కనీసం ఇద్దరు పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హత

ఇప్పుడు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోయారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్య ప్రారంభమైంది. ఫెర్టిలిటీ రేటు ఇక్కడ తగ్గిపోతోంది. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉంది. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మన దేశంలోనూ మొదలవుతుంది. భారతదేశంలో 145 కోట్ల జనాభా ఉంది. పాపులేషన్ మేనేజ్మెంట్ చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు. మనం ఒక ప్రణాళికాబద్ధంగా అమల్లోకి తీసుకువస్తే.. 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పని చేసి దేశానికి ఆదాయం తీసుకొస్తారు. బ్రిటీష్ వాళ్లు భారత్‌కి వచ్చి పరిపాలించిన తరహాలో మనం కూడా ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలుతాం. ఒకప్పుడు ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు పెట్టాను. ఇప్పుడు ఆ నిబంధన తొలగించి... కనీసం ఇద్దరు పిల్లలుంటే తప్ప పోటీకి అర్హత లేదని పెట్టాలని చెబుతున్నా. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధి జరగాలి. దానికి అనుగుణంగా పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ కల్పన జరగాలి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒకటో తరగతి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

### వాజపేయి పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు

తెలుగుదేశం పార్టీ తొలినుంచీ దేశ రాజీయాల్లో కీలక పాత్ర పోషించింది. దేశాభివృద్ధి కోసం తెలుగుదేశం ఎప్పుడూ ముందుంటుంది. భాజపాకి వాజపేయి పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా బలంగా తయారవుతోంది. రానున్న రోజుల్లో ప్రపంచంలో భారతదేశం రెండు మూడు స్థానాల్లో ఉంటుంది. నరేంద్రమోదీ మా నాయకుడు. ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తాం. హరియాణా సీఎం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ప్రధాని ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి సీఎంల సమావేశం జరిగింది. నాలుగు గంటలపాటు జరిగిన సమావేశంలో 2029 ఎన్నికలకు ఏవిధంగా సమాయత్తం అవ్వాలనే విషయంపై మోదీ అందరి అభిప్రాయాలు తీసుకున్నారు.

### మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది

ఏపీలో కూడా 2029 ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం అవుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ పాలనపట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తితో పాటు.. ఎన్డీఏ కూటమిపై జనానికి భరోసా కలిగింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వస్తాయని మేం ముందుగానే ఊహించాం. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా 57 శాతం ఓట్లు.. 93 శాతం సీట్లు కూటమికి ప్రజలిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పవన్ కల్యాణ్ మూడు పార్టీలను కలిపారు. దాని ఫలితం ఇప్పుడు చూశాం. జాతీయస్థాయిలో కూడా భాజపాకి పూర్తి మెజారిటీ వస్తుందని అనుకున్నాం. కూటమిలో ఎటువంటి సమస్యలు లేవు, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాం. మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుంది" అని చంద్రబాబు అన్నారు.

---

## రామోజీ జీవితం మనందరికీ మార్గదర్శకం

**జయంతి నివాళులర్పించిన చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. విలువలతో కూడిన జర్నలిజయంతో, నిష్పక్షపాత వైఖరితో సమాజంపై తిరుగులేని ముద్ర వేసిన మహనీయుడని కొనియాడారు. వ్యాపారాల్లోనూ సమాజహితం, ప్రజాశ్రేయస్సు చూపిన ఏకైక వ్యాపారవేత్త అని అన్నారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

తన సంస్థల ద్వారా సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన రామోజీరావును స్మరించుకోవడం ప్రజలందరి బాధ్యత అని, నిత్య స్ఫూర్తిగా నిలిచే ఆయన జీవితాన్ని మార్గదర్శిగా భావించి ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.

### రామోజీరావు స్ఫూర్తి ప్రదాత: లోకేశ్

రామోజీ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు జయంతి సందర్భంగా మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎనలేని సేవలందించిన రామోజీరావు.. స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. వ్యాపారంలోనూ సమాజ హితం కాంక్షించే ఆయన సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

---

## రిజర్వాయర్ల పనులకు రూ.156.60 కోట్లు కేటాయించాలి

**చెరువుల మరమ్మతులు, తాగునీటి అవసరాలు తీర్చాలి**

**మంత్రి నిమ్మలను కోరిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



విజయవాడ(చైతన్యరథం): అన్నమయ్య జిల్లాలో రైతులు, ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా పీలేరు మండిపల్లె వాగిరెడ్డి శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లె రిజర్వాయర్‌లో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ బ్యాలెన్స్ పనులను పూర్తి చేసేందుకు రూ.156.60కోట్లు మంజూరు చేయాలని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం విజయవాడలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఈ ఆరు మండలాల్లో చెరువుల మరమ్మతులు, తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి అడవి పల్లె రిజర్వాయర్‌కు నీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో నీటి నిల్వలు పెరిగేలా జిల్లాలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

---

## రేపటి నుంచి ప్రజావేదికలో అర్జీల స్వీకరణ

**పాల్గొనే మంత్రులు, నాయకుల షెడ్యూల్ విడుదల**

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజావేది క' కార్యక్రమానికి సంబంధించి 18వ తేదీన సోమవారం నుంచి 23వ తేదీ వరకు అర్జీల స్వీకరణలో మంత్రులు, నాయకులు పాల్గొంటారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు. అందుకు సంబంధించి షెడ్యూల్‌ను పార్టీ కార్యాలయం ప్రకటించింది. 18న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రభుత్వ సలహాదారు ఎండీ షరీఫ్, ఏపీ బయోడైవర్శిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, 19న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు, 20న టీడీపీ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ నెట్టెం రఘురాం, ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, 21న టీడీపీ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్‌గౌడ్, స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, 22న టీడీపీ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ గన్ని వీరంజినేయులు, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగాడ నాగేశ్వరరావు, 23వ టీడీపీ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీధ ర్, ఏపీ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అర్జీలు స్వీకరిస్తారు.

# ఉపాధి హామీ కాంట్రాక్టర్లకు కూటమి ప్రభుత్వం అండ

- గత ప్రభుత్వం ఆపిన బిల్లుల మంజూరు
- జగన్‌రెడ్డి కాంట్రాక్టర్ల నోట్లో మట్టికొట్టారు
- కేంద్రం నిధులు ఇచ్చినా దారిమళ్లించారు
- గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి



మంగళగిరి(చైతన్యరథం): ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లులు చెల్లిస్తూ అటు కాంట్రాక్టర్లకు, ఇటు కూలీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014-19లో నరేగా పథకం కింద చేసిన పనులకు నేడు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం హర్షణీయమన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ ద్వారా అనేక అభివృద్ధి పనులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిందని, అయితే వైసీపీ హయాంలో 350 అడ్డగోలు జీవో తెచ్చి నరేగా పనులుచేసిన వారి నోట మన్ను కొట్టారని మంది పడ్డారు. పనులు చేసిన వారు ఐదేళ్ల పాటు బిల్లులు రాకపోవడంతో 50మంది వరకు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. అనేకమంది అప్పులు తీర్చలేక పొలాలు, ఇళ్లు అమ్ముకుని నానా ఇబ్బందులు పడ్డారు.. వారి చావుకు, ప్రజల కష్టాలకు జగన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఉపాధి హామీ నిధులను సెంటు పట్టా పేరుతో వైసీపీ మంత్రులు, ఎంపీలు, వైసీపీ ముఠా దోచుకు తిన్నారని, ఏపీలో నరేగా నిధులు దుర్వినియోగమయ్యాయని స్వయంగా పార్లమెంటు సాక్షిగా చెప్పడం సిగ్గుచేటన్నారు. 2014-19లో ఎన్ఆర్ఈజీ ఎస్ పనులకు కేంద్రం రూ.2,200 కోట్లు విడుదల చేస్తే తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిధులు ఆగిపోయాయి.. తర్వాత సీఎం అయిన జగన్ వాటిని ఇతర పనులకు మళ్లించారని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఉపాధి హామీ పథ కం అటకెక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### టీడీపీ హయాంలో పనులకు బిల్లులు ఇవ్వలేదు

2014-19 మధ్యలో లోకేష్ పంచాయతీరాజ్ మంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు.. ఒక్క సంవత్సరంలోనే 12వేల కిమీ రోడ్లు వేయడమే కాకుండా ఐదేళ్లలో 6,194కోట్లు ఖర్చుపెట్టారని గుర్తు చేశారు. దేశంలో మొదటిసారిగా లోకేష్ చేసినంత అభివృద్ధి ఎక్కడా జరగలేదు.. ఎల్ఈడీ సిస్టాన్ని తీసు కొచ్చిన రాష్ట్రం అప్పట్లో ఏపీనే.. 27లక్షల ఎల్ఈడీ బల్బులు వేసి దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారు. 2,627కోట్లు ఖర్చుపెట్టి 2,823 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లువేశాం..టీడీపీహయాంలో జరిగిన పనులకు బిల్లు లు చెల్లించకుండా వైసీపీ దురుద్దేశంతో వ్యవహరించిందన్నారు. కూటమి వచ్చాక 7,700 పనులకు విజిలెన్స్ తనిఖీలు చేయించి వాటికి సంబంధించి జీవో నెంబర్ 646ద్వారా రూ.331కోట్లు విడుదలచేయించిన చంద్రబాబు, పవన్, లోకేష్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ రూ.16,730కోట్ల నిధులను ఇవాళ కేటాయించడం పల్లె ప్రాంతాలపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పాలన్న ఉద్దేశంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయమై చాలామంది ప్రమాదాల బారినపడి చనిపోయారన్నారు.నేడు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి వాటి మరమ్మతులు చేయిస్తుందని చెప్పారు.

### ఉపాధి హామీ నిధులు సాధించుకుంటాం

నరేగ ఫిర్యాదుల విభాగం సభ్యురాలు రేవతి మాట్లాడుతూ ఉపాధి హామీ పెండింగ్ నిధులు ప్రతి రూపాయి వచ్చే వరకు నరేగా గ్రీవెన్ సెల్ తరపున పనిచేస్తామని తెలిపారు. గతంలో లోకేష్ పంచాయతీ రాజ్ మంత్రిగా అద్భుతమైన విజయాలు సాధించారు..అప్పట్లో రాష్ట్రం విడిపోయి లోటు బడ్జెట్‌లో ఉన్నా గ్రామాలను అభివృద్ధి చేయటంలో అద్భుతంగా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేసింది.. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తేవడంలో విఫలం అయింది. ఒక్క సిమెంటు రోడ్డులేదు.. చెత్త నుంచి సంపద కేంద్రాలు లేవు.. ఎలాంటి అభివృద్ధి పనులు మనం చూడలేదు. రైతు భరోసా కేంద్రాలు, నవరత్నాలకు మాత్రమే వాటిని వినియోగించారు. అప్పట్లో ఉపాధి హామీలో తమికనాడు ప్రథమ స్థానం లో ఉంటే తర్వాత ఏపీ ద్వితీయ స్థానంలో నిలిచింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి తక్కువ నిధులను తీసుకున్న రాష్ట్రంగా ఏపీని నిలిపారు. పవన్‌కల్యాణ్ సారథ్యంలో తిరిగి కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ ద్వారా అత్యధిక నిధులు తెచ్చేలా కృషిచేసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆకాంక్షించారు.

# పొలాన్ని ఆక్రమించేందుకు వైసీపీ నేత యత్నం





- వరి కోత మిషన్ తగలబెట్టేస్తానని బెదిరింపులు
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుడి గోడు
- అర్జీలు స్వీకరించిన గండి బాబ్జి, బుచ్చి రాంప్రసాద్

మంగళగిరి(చైతన్యరథం): గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ పొలా న్ని వైసీపీ నేత ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలానికి చెందిన శీలం సునీల్ కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజా వినతుల కార్యక్రమంలో నాయకుల ఎదుట గోడు వెళ్ల బోసుకున్నాడు. ప్రస్తుతం సాగుచేసుకున్న వరి పంట కోతకు వచ్చింది.. వరికోత మిషన్‌లను పిలిచి పొలంలోకి దిగితే మిషన్‌లను తగల బెడతామని వైసీపీ నేత సురేంద్రనాథ్‌రెడ్డి బెదిరిస్తున్నాడు.. ఆయనకు భయపడి వరికోత మిషన్ వారు రాకపోవడంతో పండిన పంట నేలపాలు అవుతోంది.. దయచేసి వెంటనే వరి కోతను అడ్డుకుం టున్న వైసీపీ నేతపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని నేతలను విజ్ఞప్తి చేశాడు. అర్జీదారుల నుంచి ఏపీసీవోజీఎఫ్ఎల్ చైర్మన్ గండి బాబ్జి, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్‌లు విన్నపాలు స్వీకరించారు. సంబం ధిత అధికారులకు ఫోన్లుచేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- తాము యానాదులం.. నివాసం ఉంటున్న స్థలాన్ని గతంలో ప్రభుత్వం మరొకరికి కేటాయించారు.. తాము పోరాటం చేయడంతో మరోచోట భూమి ఇస్తామ ని చెప్పారు.. తమకు ఇస్తామన్న 60 సెంట్లు ఇప్పించాలని బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన బూదూరి ముత్యాలమ్మ, బూదూరి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

- తనకు నలుగురు కుమార్తెలు.. భర్త మరణాంతరం వచ్చిన ఆస్తి మొత్తాన్ని పెద్ద కుమార్తె పోకా రత్తమ్మ తనకు తెలియ కుండా ఆమె పేరున ఎక్కించుకుంది.. వృద్ధాప్యంలో తనను పట్టించుకోవడం లేదు.. న్యాయం చేయాలని బాధితురాలు ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం ఒబ్బిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రావిళ్ల తిరుపతమ్మ ఫిర్యాదు చేసింది.

- కడప జిల్లా మైదుకూరుకు చెందిన మాలేపాటి లక్ష్మీదేవి సమస్యను వివరిస్తూ సర్వే నెంబర్ 189లో తన అనుభవంలో ఉన్న స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి తనను హతమారుస్తానని తన భర్త మొదటి భార్య మూడో కుమారుడు మాలేపాటి రాధారామ్ బెదిరిస్తున్నాడు..అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

- తమ గ్రామంలో నెట్‌వర్క్ అందక ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదు.. బీఎస్ఎన్ఎల్ లేదా ఇతర ప్రైవేట్ నెట్ వర్క్ టవర్‌ను ఏర్పాటు చేయాలని ప్రకా శం జిల్లా పుల్లలచెరువు మండలం మురికి మళ్లపెంట గ్రామానికి చెందిన వెంకటే శ్వర్లు నాయక్,గిరిజనులు విజ్ఞప్తి చేశారు.

-తన మేనమామ, పిన్ని కూతురు తన పొలానికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారు.. దాన్ని రద్దు చేసి తన పేరుపై పట్టా పాస్ పుస్తకా లు ఇచ్చి ఆన్‌లైన్ చేయాలని విజయ వాడకు చెందిన బాల చెన్నకేశవరావు వినతిపత్రం ఇచ్చారు.

- వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించ కుండా గత ప్రభుత్వం తమకు అన్యాయం చేసింది.. గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదు..గతంలో చంద్రబాబు రూ.6,500 నుంచి రూ.10500లకు తమ వేతనం పెంచా రు.. తమకు పే స్కేల్ అమలు చేసి నామి నీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలి.. అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని పలువురు వీఆర్‌ఏలు వేడుకున్నారు.

### రామ్మూర్తి నాయుడి సేవలు మరువలేనివి

**- స్పీకర్ అయ్యన్న పాత్రుడు సంతాపం**



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణంపై శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటుగా పేర్కొన్నారు. నారా రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి విశేష సేవలు అందించారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గుర్తు చేశారు. సహచర శాసనసభ్యుడిగా తనతో కలిసి పనిచేసిన ఆయన విశిష్టమైన సేవలు మరవలేనివని పేర్కొన్నారు. రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తునట్లు స్పీకర్ అయ్యన్న తెలిపారు. రామ్మూర్తి నాయుడి సేవలను తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు.

### దిగ్భ్రాంతికి గురి చేసింది: మంత్రి అచ్చెన్నాయుడు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర దిగ్భ్రాంతి గురి చేసిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా రామ్మూర్తి నాయుడు సేవలు చిరస్మరణీయం అన్నారు. రామ్మూర్తి నాయుడు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానన్నారు.

### అత్యంత బాధాకరం: మంత్రి కొల్లు రవీంద్ర

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు గుండెపోటుతో మరణించారన్న వార్త తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర సంతాపం వ్యక్తం చేశారు. విలువలు, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ జీవించే రామ్మూర్తినాయుడు మరణం అత్యంత బాధ కలిగించిందన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

### పార్టీకి తీరని లోటు: మండలి చీఫ్ విప్ పంచుమర్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, మాజీ శాసనసభ్యుడు నారా రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఆయన మరణం తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేతున్నానని అనురాధ పేర్కొన్నారు.

### ఆయన సేవలు అనన్యం: ఎమ్మెల్యే పులివర్తి నాని

1994 నుంచి 1999 వరకు ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గానికి నారా రామ్మూర్తి నాయుడు చేసిన సేవలు అనన్యమని నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఐదు కిలోమీటర్ల దూరంలోని మొంది కాల్వ నుంచి పైప్ లైన్ ద్వారా చంద్రగిరి ప్రజలకు నీళ్లు అందించారని తెలిపారు. సొంత పలుకుబడితో నిధులు సమకూర్చి వారపు సంతకు మార్కెట్ ని ఏర్పాటు చేశారన్నారు. నూరు పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసిన నారా రామ్మూర్తి నాయుడు ప్రజా సేవలో చూపిన మార్గం మాకు ఆదర్శమని నాని పేర్కొన్నారు.

చైతన్యరథం

# ఆనందాంధ్రను ఆవిష్కరించే బడ్జెట్!

ఆనందాంధ్రను ఆవిష్కరించే విధంగా బడ్జెట్ రూపొందించారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. పన్నుల బాదుడు జోలికి పోకుండా కొత్త ఆదాయ వనరులను అన్వేషిస్తూ, మూలధన వ్యయాన్ని పెంచుతూ రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించేలా బడ్జెట్‌లో బాటలు వేశారు. అభివృద్ధి పూర్తిగా అడుగంటి ఏపీ అస్తిత్వమే ప్రశ్నార్థకమైన రాష్ట్ర భవిష్యత్తును కాచుకోవడమే లక్ష్యంగా.. విధ్వంస ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ మహాయజ్ఞానికి ఎన్డీయే ప్రభుత్వం సమగ్ర ఆర్థిక ప్రణాళికను రూపొందించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీర్చిదిద్దిన 2024-25 ఆర్థిక సంవత్సరం పూర్తిస్థాయి బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ నవనిర్మాణం దిశగా కొత్త అడుగులువేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి పునరంకితమవుతూ నిధుల కేటాయింపులు చేశారు. అభివృద్ధి సంక్షేమం, ఎన్నికల హామీల అమలు, రాజధాని, పోలవరం నిర్మాణంవంటి అనేక ఒత్తిళ్ల మధ్య కూడా భారీ కసరత్తు చేసి భారీ బడ్జెట్‌ను రూపొందించారు. ఏవర్గాన్ని అసంతృప్తి పర్చకుండా దీర్ఘకాలంలో చేకూరే ప్రయోజనాలు, ప్రస్తుతం చేకూరే ప్రయోజనాలు, హామీలు, భరోసాలు బాగానే కల్పించారు. బడ్జెట్ రూపొందించే సమయంలో వాస్తవికతను ప్రజల కళ్లకు కట్టారు. ఇండియాలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా నిలపడమే లక్ష్యంగా అద్భుత బడ్జెట్ రూపొందించడం అభినందనీయం. భారమైనా భారీగానే బడ్జెట్ కేటాయింపులు జరిపి సమస్యలకు తలొగ్గేదిలేదన్న తెగువను కనబర్చారు ఆర్థిక మంత్రి. జనం ఆశలు, సీఎం చంద్రబాబు కలలు కలగలిపి స్వర్ణాంధ్ర దిశగా ప్రయాణం మొదలైంది. ఐదేళ్ల అసుర పాలనలో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అగమ్యగోచరంగా మారిన అత్యంత కీలక తరుణంలో తమను ఒడ్డుకు చేర్చే బాధ్యతను సమర్థ నాయకుడు, దార్శనికుడైన చంద్రబాబుకే అప్పగించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రగతిలో ప్రవర్ధమానం కావాలని ఐదునెలలుగా ఒక్క రోజు విరామం లేకుండా శ్రమిస్తున్నారు.

జగన్ జమానాలో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక అరాచకం రాజ్యమేలింది. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. సకల వ్యవస్థలూ గాడి తప్పాయి. వీటన్నింటినీ సరిదిద్ది రాష్ట్రాభివృద్ధిని పరుగులు తీయించడం నూతన ప్రభుత్వానికి సవాలే. అయినా సమర్థ ఆర్థిక నిర్వహణ, సమగ్ర ప్రణాళికలు, వినూత్న విధానాలతో ముందుకుసాగితే ఏపీ దశ మారడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో వేరేచెప్పనక్కరలేదు. కానీ కష్టపడితే సిద్ధించే లాభాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న ఉత్తమ విధానాలను అనుసరించడం, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం, సాంకేతికతలను

> 'మనలోని ఉత్సాహాన్ని సమర్థవంతంగా సద్వినియోగపరిస్తే బ్రహ్మాండమైన నిర్మాణశక్తి ఉద్భవిస్తుంది.'
>
> ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆనాటి ప్రధాని 70 ఏళ్ల క్రితమే ఉద్బోధించారు.

అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత సవాళ్లను అధిగమించి అగ్రస్థాయికి ఎదగవచ్చు. అనుభవం, దార్శనికత మెండుగావున్న నాయకత్వం రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా నిలుస్తుంది. చీకట్లు కమ్మిన, శిథిలసౌధంగా మిగిలిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అలంబనలయ్యే పోలవరం, రాజధాని నగర నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం చేయూతనందించేందుకు ముందుకు రావడం అభినందనీయం.

విధ్వంస రాష్ట్ర పునర్నిర్మాణానికి, అన్నివర్గాల అభ్యున్నతికి ఆర్థికమంత్రి కేశవ్ తొలి పద్దు వేగుచుక్కలా పొడిచింది. రాజధానికి నిధులిచ్చింది. పోలవరానికి వరాలు కురిపించింది. అమరావతి, పోలవరాన్ని వేగంగా నిర్మించాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యాలకు అనుగుణంగా అన్నివైపులనుంచి సహకారం లభిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి, భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలకు కలిపి రూ.3,445 కోట్లు కేటాయించారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణాన్ని ఒక కొలిక్కి తేవాలన్న లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వం భారీగా కేటాయింపులు చేశారు. ఒకవైపు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల సాయానికి పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం రాజధాని పనులు పరుగులు పెట్టించేందుకు బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులిచ్చింది. రాబోయే నాలుగు నెలల్లో ఈ నిధులతో అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీయనున్నది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల కింద ఆస్తులు సృష్టించేలా మూలధన వ్యయం చేసేందుకు రూ.32,712 కోట్లు కేటాయించారు. ఐదు కోట్ల ఆంధ్రుల జలదేవాలయం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5.445 కోట్లు కేటాయించడం అభినందనీయం. పోలవరం ప్రాజెక్టు తొలి దశకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించింది. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం సహా మిగిలిన నిర్మాణ పనులు 2027 మార్చినాటికి పూర్తి చేసి జాతికి అంకితం చెయ్యనున్నారు. అమరావతి, పోలవరం నిర్మాణాలను పరుగులు తీయించాలని నిర్ణయించడం సీఎం చంద్రబాబు దీక్షా దక్షతలకు అద్దం పడుతుంది. 2025 న్యూ ఇయర్‌లో ఆంధ్రప్రదేశ్ గేరు మార్చబోతున్నది. ఏపీని వెలుగులవైపు మళ్లించబోతున్నారు చంద్రబాబు.

తన తొలి పద్దులోనే సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యతనిస్తూ పేదల గుండెల్లో ఎన్డీయే ప్రభుత్వానికి పెద్దపీట వేశారు. అన్నదాతా సుఖీభవా అంటూ, అమ్మకు వందనాలు పలికింది తొలిపద్దు. ఆడబిడ్డ నిధితోపాటు త్వరలోనే కొత్త సంక్షేమ పథకాలు ప్రారంభం కాబోతున్నాయని సంకేతాలిచ్చింది. జగన్ జమానాలో మంగళంపాడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా మళ్లీ స్వయంఉపాధి పథకాలు చేపట్టేందుకు వీలుగా రాయితీపై రుణాలిచ్చేందుకు బాటలు వేశారు. గత పాలనలో దగాపడ్డ మధ్యతరగతి ప్రజలు, అట్టడుగు ప్రజలు వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అన్నివర్గాల జీవనాన్ని గుణాత్మకంగామార్చే బృహత్తర లక్ష్య సాధన కోసం పేదప్రజల సంక్షేమానికి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించింది. చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున సాయం చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా, దీనికోసం 'తల్లికి వందనం' పథకానికి రూ.6,487 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం హర్షణీయం. రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రకటించిన అన్నదాతా సుఖీభవ పథకానికి రూ.1000 కోట్ల నిధులు కేటాయించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 సాయం చేస్తామన్న హామీ అమలుకు మహిళా నిధి కింద బడ్జెట్‌లో రూ.3341 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాలకు, వారికి సంబంధించిన మౌలిక సౌకర్యాల కల్పనకు కలిపి రూ.69,437 కోట్లు కేటాయించారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని రూ.10 లక్షల వరకు అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు రూ.1,250 కోట్లు. పేదల గృహ నిర్మాణం కోసం రూ.4,012 కోట్లు. పట్టణాల్లో జీ ప్లస్3 తరహాలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు రూ.1,088 కోట్లు కేటాయించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి స్వయం ఉపాధి పథకాల కింద రాయితీ రుణాలు ఇచ్చేందుకు రూ.1,521 కోట్లు నిధులు కేటాయించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వాటాయే బ్యాంకుల రుణాలు కలిపితే ఈ నిధులు రెండు రెట్లు పెరగనున్నాయి.

వ్యవసాయ ప్రధానమైన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు కలిపి రూ.48,402 కోట్లు కేటాయించారు. ఇందులో ఉచిత విద్యుత్తు రూ.7.211 కోట్లు, జలవనరుల శాఖకు రూ.16,705 కోట్లు ఖర్చు చెయ్యనున్నారు. వంశధార-2, వెలిగొండ, హంద్రీనీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి, చింతలపూడి ఎత్తిపోతల పథకం, మహేంద్ర తనయ సాగునీటి ప్రాజెక్టులతో పాటు అనేక ఇతర ప్రాజెక్టులు నిర్మాణానికి నిధులు కేటాయించడం అభినందనీయం.

గత ఐదేళ్లలో రాష్ట్రంలో రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రస్తుత బడ్జెట్‌లో రహదారుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. ఇందుకోసం రూ.5.441 కోట్లు కేటాయించారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.1,098 కోట్ల, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.16,739 కోట్లు కేటాయించారు. పల్లెల్లో జలజీవన్ మిషన్ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆసియా మౌలిక సౌకర్యాల అభివృద్ధి బ్యాంకు నిధులతో చేపట్టే ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులిచ్చి ఇళ్లలో జలజీవన్ మిషన్ పనులు ఊపందుకునేందుకు బడ్జెట్ వీలు కల్పించింది. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహక బకాయిలు చెల్లించేందుకు బడ్జెట్లో రూ.2,270.70 కోట్లు నిధులు కేటాయించారు. కొత్తగా పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు భూసేకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మూలధన వ్యయం కింద నిధులు కేటాయించారు.

నాయకుడికి తొణకని పట్టుదల ఉంటే రాష్ట్రం అన్ని సవాళ్లనూ అధిగమించి ప్రగతిపథంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుంది. ఎదురుగా కనిపిస్తున్న దారి కంటకప్రాయమైనదే. అయినా శక్తివంచన లేకుండా కష్టించి ప్రజల కలలను నిజం చేసేందుకు నూతన చైతన్యం నిండిన దార్శనికత వున్న నాయకుడు పాలకుడిగా వున్నారు. ఏపీ భవిత చాలా ఆశాజనకంగా కనబడుతోంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని మరింత ఉన్నతమైన ఉత్సాహంతో భవిష్యత్తు కోసం దృఢ సంకల్పంతో ముందుకు నడస్తే ఆనందాంధ్రను ఆవిష్కరించవచ్చు.

- నీరుకొండ ప్రసాద్.

# గొప్ప మానవతావాది రామ్మూర్తి నాయుడు

## - టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతల నివాళులు

అమరావతి (చైతన్యరథం): పేదల గొంతుకగా, పేదల మనిషిగా, సీఎం చంద్రబాబుకు సోదరుడిగా, ప్రతిక్షణం మంచికోసం, మంచి ప్రభుత్వ ఏర్పాటు కోసం పరితపించిన వ్యక్తి నారా రామ్మూర్తి నాయుడు అని.. అలాంటి వ్యక్తి హఠాత్తుగా కన్నుమూయడం బాధాకరమని టీడీపీ నేతలు విచారం వ్యక్తం చేశారు. రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం తెలియజేస్తూ టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ.. రామ్మూర్తి నాయుడు గొప్ప మానవతావాది అని కొనియాడారు. ఆయన అందరినీ కలుపుకొని పోయే వ్యక్తి అన్నారు. అందరి తలల్లో నాలుకలా ఉండే వ్యక్తి అని.. ప్రజల మనిషి అని.. టీడీపీ గెలుపుకోసం ఆయన ఎంతో



పరితపించారన్నారు. దుర్మార్గం నశించి రామరాజ్యం రావాలని ఆకాంక్షించిన వ్యక్తి రామూర్తి నాయుడన్నారు. ఆయన మంచితనమే ఆయనను ప్రజల గుండెల్లో ఉంచిందన్నారు. అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని, ఆయన అమరుడైనా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేట్ అథారిటీ ఛైర్మన్ శ్యావల దేవదత్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, హ్యాండ్‌లూమ్ కోఆపరేటీవ్ చైర్ పర్సన్ సజ్జా హేమలత, టీడీపీ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముస్తాక్ అహ్మద్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, టీడీపీ కేంద్ర కార్యాలయ రిసెప్షన్ ఇన్చార్జ్ హాజీ హసన్ బాషా, ఎన్ఆర్ఐ సెల్ చప్పిడి రాజశేఖర్, పార్టీ నాయకులు శంకర్ నాయుడు, రవియాదవ్, ములక సత్యవాణి, పీరయ్య, సుభాషిణి, తదితరులు పాల్గొని రామ్మూర్తి నాయుడికి నివాళులు అర్పించారు.

# విచ్ఛిన్నకర శక్తులను తరిమికొట్టండి



- మహారాష్ట్రలో ఛత్రపతి స్ఫూర్తిని గెలిపించాలి
- అభివృద్ధి కోసం మహాయుతి విజయం అవసరం
- శివాజీ మహారాజ్ ఆశయాలతోనే మోదీ ముందడుగు
- ఎన్డీఏ పాలనలో అన్ని రంగాల్లో అగ్రగామిగా భారత్
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- దేగ్లూర్, నాందేడ్‌ల్లో ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం

అమరావతి(చైతన్యరథం): ప్రజలను విభజించి పాలించాలనుకునే పాలకులను తరిమికొట్టాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మహారాష్ట్ర లోని దేగ్లూర్‌లో శనివారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి జితేశ్ రావ్ సాహెబ్ అంతాపుర్కార్ కుటుంబ సభ్యులు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన బహిరంగసభలో పవన్ ఉద్వేగ భరితంగా ప్రసంగించారు. నేను ఇక్కడికి కేవలం ఓట్లు అడగడానికి రాలేదు. ఎందరో మహనీయులు పుట్టిన నేల, ఎందరో సాధువులు నడిచిన నేల.. మహానుభావులు ఉన్న నేల మీద గౌరవం తెలపడానికి వచ్చాను. శివాజీ మహారాజ్ పుట్టిన నేల.. మన హక్కుల మీద మనకు పోరాటం నేర్పిన నేల మీద గౌరవం తెలపడానికి వచ్చాను. బాబా సాహెబ్ అంబేద్కర్ కర్మ భూమిగా నిలచిన గొప్ప భూమిపై గౌరవం తెలపడానికి వచ్చాను. రాజమాత జిజియా బాయి నేర్పిన విలువల నేలకు నమస్కరించడానికి వచ్చానంటూ ప్రజల కరతాళ ధ్వనులను అందుకున్నారు.

***దేశంలో అభివృద్ధి పరుగులు***

చరిత్ర కలిగిన మహారాష్ట్రలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం, దేశ సమగ్రాభివృద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వానికి యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలకాలని పవన్ పిలుపు ఇచ్చారు. మరాఠా గడ్డపై ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు. గత పదేళ్లలో ఎన్డీఏ పాలనలో ప్రపంచ చిత్రపటంలో మువ్వన్నెల జెండా రెపరెపలు కనబడుతున్నాయన్నారు. నాగపూర్ నుంచి థానే వరకు నిర్మించిన సమృద్ధి మహామార్గం మహారాష్ట్ర నవనిర్మాణానికి బాటలు వేసిందని చెప్పారు. జనసేన ఏడు సిద్ధాంతాల్లో ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అనే సిద్ధాంతానికి బాలా సాహెబ్ స్ఫూర్తి అన్నారు. గడచిన పదేళ్లుగా ఎన్డీఏ పాలనలో ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్‌లో అభివృద్ధి, దివ్య రామమందిరంతో అలంకరించిన అయోధ్య, దేశ నలుమూలలను కలిపే రహదారులు, పల్లె పల్లెకు విస్తరించిన రోడ్లు కనబడుతున్నాయన్నారు. 4 కోట్ల మంది రైతులకు పంట బీమా, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా 12 కోట్ల మందికి లబ్ధి చేకూరిందన్నారు. ముద్ర యోజన ద్వారా 30 కోట్ల మంది ఆడబిడ్డలకు చేయూత దక్కిందన్నారు. గత పదేళ్లలో నితిన్ గడ్కరీ చొరవతో దేశ వ్యాప్తంగా 11 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి థానే వరకు 701 కిలోమీటర్ల సమృద్ధి మహా మార్గాన్ని నిర్మించారన్నారు.

***సనాతన ధర్మాన్ని కాపాడే ప్రభుత్వాలు కావాలి***

మహారాష్ట్ర చరిత్రను చూస్తే ఎంతో మంది సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు కృషి చేశారు. ఇలాంటి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో పాల్ఘర్‌లో సాధువులను చంపేశారు. చేతులెత్తి వేడుకున్నా వదలలేదు. సర్వజన హితం కోరే సాధువులను చంపితే ఒక్కరు పట్టించుకోలేదు. సాధువులను చంపిన వారికి శిక్ష పడాలి. మహారాష్ట్ర వ్యాప్తంగా శివాజీ మహారాజ్ పోరాడిన దుర్గాలన్నీ దక్షిణ భారతాన్ని హిమాలయ పర్వతంలా కాపాడాయి. ఆక్రమణదారుల్ని రానివ్వకుండా కోటలా అడ్డుపడటంతో దక్షిణ భారత దేశంలోని దేవాలయాలను ఆక్రమణదారులు తాకలేకపోయారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ పోరాడింది ఆక్రమణదారుల మీదనే. అలాంటివారిపై ఇప్పుడు మరోసారి పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని పవన్ అన్నారు.

పవన్ కళ్యాణ్ తన ప్రసంగాన్ని జై భవానీ, జై శివాజీ, జై మహారాష్ట్ర నినాదాలతో మొదలు పెట్టి జై భారత్.. జై శ్రీరాం.. జై హింద్.. నినాదాలతో ముగించారు. సభకు సరిహద్దు రాష్ట్రాలు అయిన తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీ సంఖ్యలో పవన్ అభిమానులు తరలివచ్చారు. గజమాలలతో సత్కరించి మహారాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించే జ్ఞాపికలు అందజేశారు.

'ఐదు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ ప్రభుత్వం 175 స్థానాలకు 164 స్థానాలు గెలిచి అద్భుత విజయం సాధించిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ ప్రభుత్వం నిలబెట్టుకుంటుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసిందన్నారు.




మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ మాట్లాడుతూ పవన్ తుఫాన్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం దేశం మొత్తాన్ని ఏకం చేస్తుందన్నారు. మహారాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మహాయుతి కూటమికి పట్టం కట్టాలన్నారు. ఈ సభలో బీజేపీ జాతీయ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాందేడ్, దేగ్లూర్ అసెంబ్లీల బరిలో ఉన్న అభ్యర్థులు, నాందేడ్ జిల్లా మహాయుతి నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో టిడ్కో ఇళ్లలో అక్రమాలపై దర్యాప్తు

- మంత్రి నారాయణ వెల్లడి
- జగన్ పిచ్చి పనులతో లబ్ధిదారులకు ఇక్కట్లు
- లబ్ధిదారులు తొలగింపు, డీడీల చెల్లింపుల్లో అవకతవకలు
- అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చకు మంత్రి సమాధానం

అమరావతి (చైతన్యరథం) : గత ఐదేళ్లలో జగన్ రెడ్డి చేసిన పిచ్చి పనులతో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేసారు గత ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకులకు డీడీల చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు నారాయణ ప్రకటించారు. అసెంబ్లీలో శనివారం జరిగిన స్వల్పకాలిక చర్చలో 18 మంది ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో టిడ్కో ఇళ్లలో జరిగిన అక్రమాలు, అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి నారాయణ స్పందించారు. అసలు టిడ్కో ఇళ్ల అనుమతుల నుంచి జరిగిన పరిణామాలను వివరించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు నిరుపేదల కష్టాలు బాగా తెలుసన్నారు. అందుకే పేదలకు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వివిధ దేశాల్లో పేదల ఇళ్ల నిర్మాణాల తీరుపై అధ్యయనం చేశామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా కేంద్రం నుంచి 7 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తెచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం లక్షా 50 వేలు, రాష్ట్ర ప్రభుత్వం మరో లక్షా 50 వేలు చెల్లించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఒక్కొక్క ఇంటికి 90 వేలు ఖర్చు భరించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. 2014 - 2019 మధ్యలో టిడ్కో ద్వారా హై క్వాలిటీ ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కేంద్రం అనుమతి ఇచ్చిన వాటిలో ముందుగా 5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టేలా పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసామన్నారు. ముందుగా 4,54,706 ఇళ్లకు టెండర్లు పిలిచి నిర్మాణాలు ప్రారంభించామన్నారు. 2019 మే నెల నాటికి 77 వేల 370 ఇళ్లు వంద శాతం పూర్తి చేసాం. గత వైసీపీ ప్రభుత్వం ఎలాంటి కారణాలు లేకుండా మొత్తం ఇళ్లను రెండున్నర లక్షలకు తగ్గించేసింద న్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా షీర్ వాల్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించలేదన్నారు. కేంద్రం సూచనలతో ఏడు రాష్ట్రాల అధికారులు వచ్చి ఇక్కడ నిర్మాణాలను పరిశీలించినట్లు మంత్రివెల్లడించారు. మొత్తం రూ.38,265 కోట్లతో చేపట్టిన ప్రాజెక్ట్‌లో రూ.7500 కోట్లు కేంద్ర ప్రభుత్వం, 17,730 కోట్లు ఏపీ ప్రభుత్వం భరించేలా ప్రణాళిక తయారు చేశామన్నారు.

300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించేలా కేంద్రం డిజైన్ చేసిందన్నారు. కొంతమంది లబ్ధిదారులు 360 చ.అడుగులు, మరికొంతమంది



430 చదరపు అడుగులు విస్తీర్ణంలో ఇళ్లు కావాలని కోరినట్లు మంత్రి నారాయణ తెలిపారు. దీనితో లబ్ధిదారుల విన్నపాలను మన్నించి మౌలిక వసతుల కోసం భరించే ఖర్చు రూ.90 వేలు కాకుండా 300 చ.అ.విస్తీర్ణానికి రూ.5.65 లక్షలు, 360 చ.అడుగుల విస్తీర్ణానికి రూ.6.65 లక్షలు, 430 చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లకు రూ.7.65 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేసామన్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటాను గందరగోళం చేసి అస్తవ్యస్తంగా మార్చేసిందన్నారు.

ప్రతి ఇంటి కిచెన్‌లో బ్లాక్ గ్రానైట్ రాయి, స్టెయిన్ లెస్ స్టీల్ సింక్, అటకలు ఏర్పాటు చేసామన్నారు. కప్ బోర్డుల ఏర్పాటు చేసి, ఏ గ్రేడ్ వర్టిఫైడ్ టైల్స్ వేసినట్లు మంత్రి వివరించారు. గేటెడ్ తరహాలో కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, ఆవరణలోనే ఓ పాఠశాల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పోలీస్ అవుట్ పోస్ట్, అప్రోచ్ రోడ్డు, ప్రతి దగ్గర పార్కు, తాగునీటి సదుపాయాలు కల్పించేలా డిజైన్ చేశామని కానీ గత ముఖ్యమంత్రి అన్నింటిని పూర్తిగా రద్దు చేశారన్నారు. లబ్ధిదారులు ఇళ్లలో చేరకుండానే బకాయిలు చెల్లించాలని రుణాలు ఇచ్చిన బ్యాంకు అధికారులు వెంట పడుతున్నారన్నారు. బాధితుల పరిస్థితి అర్థం చేసుకుని బ్యాంకర్లతో మాట్లాడుతున్నా మన్నారు. పూర్తయిన ఇళ్లకు టీడీపీ రంగులు వేయాలని కొంతమంది సూచించినప్పటికీ సీఎం చంద్రబాబు ఒప్పుకోలేదని చెప్పారు. దీంతో గేటెడ్ కమ్యూనిటీ రంగులు వేసామన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే వాటి రంగులు మార్చేసారన్నారు. ఇళ్ళ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.540 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్ల సమస్యలపై చీఫ్ ఇంజినీర్లతో కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటా మన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మౌలిక వసతుల కల్పన కోసం రూ.5200 కోట్లు హడ్కో లేదా ఇతర బ్యాంకుల రుణం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొన్ని చోట్ల టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు పొందిన లబ్ధిదారులను తొలగించడంతో పాటు, కొంతమంది లబ్ధిదారులు డీడీలు చెల్లించినప్పటికీ వాటిని బ్యాంకుల్లో జమ చేయలేదన్నారు. ఈ రెండు అంశాలపై దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు మంత్రి నారాయణ సభలో ప్రకటించారు.

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు



- మంత్రి సవిత ఉద్ఘాటన
- గుంటూరులో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం
- బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు
- త్వరలో ఆన్ లైన్లోనూ అందుబాటులోకి
- డిసెంబర్ నుంచి సివిల్స్ పరీక్షలకు కోచింగ్

గుంటూరు (చైతన్యరథం): రానున్న ఐదేళ్ల కాలంలో 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖల మంత్రి ఎస్ సవిత తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి డీఎస్సీ నిర్వహణ పూర్తయి, అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో నూతన ఉపాధ్యాయు లు బాధ్యతల్లో చేరడం ఖాయమని స్పష్టం చేశారు. వచ్చే నెల నుంచి బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో సివిల్స్ కోచింగ్ ప్రారంభించనున్నామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను గుంటూరు కలెక్టరేట్లో ఉన్న ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో ఎమ్మెల్యే మహ్మద్ నజీర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులతో కలిసి శనివారం లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సవిత మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ పై చేశారన్నారు. 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో తన తొలి సంతకం కూడా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ల ఏర్పాటు ఫైల్‌పై చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దానిలో భాగంగా గుంటూరు డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు నెలల పాటు ఈ శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టయిఫండ్ తోపాటు పుస్తకాల కొనుగోలుకు రూ.1000 అందజేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయ మన్నారు. చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా మంత్రి నారా లోకేష్..రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశ,విదేశాల్లో కాళ్లకు బలపం కట్టుకుని తిరుగు తున్నారన్నారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు సుల భంగా లభిస్తాయన్నారు. చంద్రబాబు, లోకేష్ స్ఫూర్తితో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల యువకులు ఎక్కువ టీచర్ పోస్టులు సాధించాలన్న ఉద్దేశంతో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సబ్జెక్టుల వారీగా నిష్ణాతులైన అధ్యాపకులతో కోచింగ్ ఇప్పిస్తున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ అందిస్తున్న ఈ సదావకాశాన్ని వినియోగించుకుని, బీసీ అభ్యర్థులు ఎక్కువ టీచర్ పోస్టులు సాధించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

**_త్వరలో ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభం_**

ఆఫ్‌లైన్‌లో అవకాశం లభించని వారికోసం ఆన్‌లైన్ లోనూ డీఎస్సీ ఉచిత కోచింగ్ అందివ్వనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఇందుకు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందిస్తున్నామన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన సమయంలో ఓపెన్ చేసి క్లాసు వినేలా వెబ్‌సైట్ ను రూపొందిస్తున్నామన్నారు. ఈ వెబ్ సైట్ లో అధ్యాకుల వీడియోలతో పాటు పాత క్వశ్చన్ పేపర్లు, టెస్ట్ పేపర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. అర్హులందరికీ ఆన్‌లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ ఇస్తామన్నారు.

**_డిసెంబర్ నుంచి సివిల్స్ కోచింగ్_**

యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ముఖ్యంగా బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నది ఆయన ఉద్దేశమన్నారు. చంద్రబాబు ఆశయం మేరకు డీఎస్సీకి మాత్రమే కాకుండా బీసీ బిడ్డలకు సివిల్స్ పరీక్షలకూ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. డిసెంబర్ నుంచి తొలుత 100 మందికి సివిల్స్ కోచింగ్ ఇవ్వనున్నామన్నారు. ఇప్పటికే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించామన్నారు. భవిష్యత్తులో నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా నిరుద్యోగ యువత అన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ అందజేస్తామన్నారు.

**_1.80 లక్షల టీచర్ పోస్టుల భర్తీ_**

చంద్రబాబు వస్తే జాబులు వస్తాయని గుర్తెరిగే రాష్ట్రంలో యువత ఇటీవల జరిగిన ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విజయాన్ని కూటమికి కట్టబెట్టారని మంత్రి సవిత తెలిపారు. 1994కు ముందు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో టీచర్ పోస్టులు భర్తీ చేసేవారన్నారు. తరవాత వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారన్నారు. గడిచిన 30 ఏళ్లలో టీడీపీ ప్రభుత్వాల నేతృత్వంలో 2.20 లక్షల ఉపాధ్యాయ పోస్టులను నోటిఫై చేయగా 1.80 లక్షల పోస్టులను భర్తీ చేశామన్నారు. త్వరలో మరో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. ఐదేళ్ల పాలన ముగింపు దశలో, ఎన్నికలకు రెండు నెలల ముందు తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ హడావుడి చేసి, నిరుద్యోగ యువతను జగన్ మోసం చేశారని మంత్రి మండిపడ్డారు.

**_సోషల్ మీడియా సైకోలపై ఉక్కుపాదం_**

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు పెట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి సవిత హెచ్చరించారు. డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో వెనుకబడిన వారికి తీవ్ర అన్యాయం చేసి జగన్ బీసీ ద్రోహిగా ముద్రపడ్డారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం బడ్జెట్‌లో బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు రూ.39 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారన్నారు. బీసీ మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. తనపైనా అసభ్యకర పోస్టులు పెట్టారని, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెట్టేవారిని క్షమించేది లేదన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ లక్ష్మణరావు సేకరించిన విద్యా, మనో విజ్ఞాన శాస్త్రం పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, డైరెక్టర్ మల్లికార్జున, ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వెంకట గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

## ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని పిలుపు - ఖతార్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నూకసాని

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని ఖతార్‌లోని ఆంధ్ర ప్రజలకు, ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీ టీడీసీ) చైర్మన్, ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ పిలుపు ఇచ్చారు. ఖతార్ దేశంలోని ఏపీ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు సంయుక్తంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకల్లో నూకసాని పాల్గొన్నారు. ఖతార్ లోని లయోలా ఇంటర్నేషనల్ స్కూల్ (ఎజ్దాన్ ఒయాసిస్)లో నిర్వహించిన ఈ వేడుకల్లో ఖతార్- ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యుల ఆహ్వానం మేరకు గౌరవ అతిథిగా నూకసాని బాలాజీ, ముఖ్య అతిథిగా ఖతార్‌లోని భారత రాయబారి హెచ్ఈ విపుల్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న మన ఆంధ్ర ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇది తెలుగు వారందరికీ ప్రత్యేకమైన రోజు అన్నారు. మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలకు పట్టం కట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన ఈ ప్రత్యేక సందర్భంలో మీ అందరితో కలిసి ఈ వేడుకల్లో పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.





ఈ రాష్ట్ర అభివృద్ధిలో ఎంతోమంది నాయకుల విశేష కృషి ఉందన్నారు. అందులో ముఖ్యంగా మన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించి, తెలుగు ప్రజల అభ్యున్నతికి అంకితభావంతో పని చేసి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలుగులు నింపారన్నారు. ఆయన "తెలుగు ఆత్మగౌరవం" కోసం నిలబడిన గొప్ప నాయకుడు. తెలుగు ప్రజలందరి హృదయాల్లో ఆయన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. తెలుగు ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్థాయిగా ఉంటుందని నూకసాని కొనియాడారు.

అలాగే, చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాంకేతికత, డిజిటల్ రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రం సాంకేతిక రంగంలో ఎంతో ప్రగతి సాధించింది. స్మార్ట్ సిటీలు, ఐటీ రంగాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై తీసుకున్న చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలబెట్టాయి. నేడు రాష్ట్ర రాజధానిగా అమరావతి నగర నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి, రాష్ట్రాభివృద్ధికి కొత్త మార్గాన్ని చూపించారని నూకసాని అన్నారు. ఇప్పటి యువత కూడా ఈ మహానేతల మార్గంలో నడుస్తూ మీ శక్తిని, బలాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలని పిలుపు ఇచ్చారు. మన తెలుగు భాష గొప్పతనాన్ని కాపాడుకుంటూ, అభివృద్ధి బాటలో ముందుకు సాగుదామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. చంద్రబాబు ఆలోచనలకు తగిన విధంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ఖతార్ పర్యటన ఎంతగానో దోహదపడిందన్నారు. ఇందుకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా, ఆర్థికంగా, సాంకేతికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా మనమందరం సమష్టిగా కృషి చేద్దామని నూకసాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖతార్ లోని ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



